క్లుప్తంగా

రూ.3 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ వెంకటలక్ష్మి

మునగపాక: తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు. పంచాయతీ పరిధి గవర్ల అనకాపల్లి శ్మశానవాటికలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి కోటా ద్వారా మంజూరైన రూ.3 లక్షలతో చేపట్టిన పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటాడ పంచాయతీలో ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. శ్మశానవాటిక అభివృద్ధి పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ పలు సచివాలయాల్లో ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన వారు సంబంధిత కేంద్రాలకు వెళ్లి సేవలు పొందాలన్నారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 21న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో చేరేందుకు ఈ నెల 20న పరీక్ష నిర్వహించాల్సి ఉండగా, ఆరోజు ఆదివారం కావడంతో ప్రభుత్వం 21వ తేదీకి మార్పు చేసిందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

14న అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 14న ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని వేదపండితులు సోమశేఖర శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మళయాల సంవత్సరాది సందర్భంగా ఉదయం 5 గంటల పూజ కార్యక్రమాలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు కోలాటం ప్రదర్శన, అన్నమయ్య సంకీర్తనలు జరుగుతాయన్నారు. అనంతరం ఊయల సేవ జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అయ్యప్పను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మునగపాక: మండలంలోని వెంకటాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెంకటాపురం, సిరసపల్లి, తోటాడ, రామారాయుడుపేట, నారాయుడుపాలెం, మూలపేట, పాటిపల్లి, చిన్నోడుపాలెం తదితర గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

అనుమానిత ప్రదేశాలపై డ్రోన్ నిఘా



డ్రోన్ కెమెరాతో పరిశీలించిన పెదరాంభద్రపురం గ్రామం

పాయకరావుపేట: డ్రోన్ కెమెరాతో అనుమానిత ప్రదేశాలపై నిఘా పెట్టామని సీఐ జి.అప్పన్న తెలిపారు. పెదరాంభద్రపురం, చిన్ననర్సాపురం, అరట్లకోట గ్రామాల్లో డ్రోన్ కెమెరాతో ప్రదేశాలను పరిశీలించడం జరిగిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో డ్రింకింగ్, మహిళలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లోను డ్రోన్ కెమెరాతో పరిశీలించామన్నారు.

నేడు అధికారులతో రివ్యూ

పాయకరావుపేట: హోంమంత్రి వంగలపూడి అనిత నాలుగు మండలాలకు చెందిన అధికారులతో శుక్రవారం సమావేశమవుతారని ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పంచాయతీ రాజ్ అతిథి గృహంలో ఎంపీడీవోలు, ఇంజనీరింగ్, ఇరిగేషన్, హౌసింగ్, వ్యవసాయ శాఖలకు సంబంధించి రివ్యూ నిర్వహిస్తారన్నారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా రాహుల్

అచ్యుతాపురం రూరల్: జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని మార్టూరు గ్రామానికి చెందిన ఎం.వి.ఆర్. రాహుల్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

స్మార్ట్‌గా చిరు వ్యాపారం



బీచ్‌లో గుర్రంతో కౌబోయ్ వేషధారణలో రాతు



బీచ్‌లో కొబ్బరి బొండాలు మిషన్‌తో స్టాల్ ఏర్పాటు



గాజు పెట్టెలో పుచ్చకాయ ముక్కల విక్రయం

- అధునాతన పద్ధతులతో అమ్మకాలు
- కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్న వ్యాపారులు

ఎస్.రాయవరం: ఇప్పుడంతా స్మార్ట్ ట్రెండ్ నడుస్తోంది. ఫోన్లు దగ్గర నుంచి నగరాలు వరకు అంతా స్మార్టే.. ఇప్పుడు చిరు వ్యాపారం కూడా ఇదే బాట పట్టింది. మండలంలో వాణిజ్య కేంద్రం అడ్డురోడ్డు, టూరిజం కేంద్రం రేవుపోలవరం బీచ్, మండల కేంద్రం ఎస్.రాయవరంలో పలువురు చిరువ్యాపారులు పండ్లు, ఇతర ఆహార పదార్థాలు అమ్మేందుకు స్మార్ట్ టెక్నాలజీని వాడుకుంటున్నారు. అడ్డురోడ్డులో ఓ పండ్ల దుకాణం మహిళ అన్ని రకాల ఫ్రూట్స్ అమ్మేందుకు స్మార్ట్ వాచిలాంటి తూకం మిషన్ వినియోగిస్తోంది. ఇక్కడ కొనుగోలుదారులకు తూకం వేసి పండ్లను అమ్మాలంటే విద్యుత్ సదుపాయం లేదు. పాత రకపు తూకం పెట్టుకుంటే ఎవ్వరూ కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపరు. దీంతో టెక్నాలజీ మిషన్ వాడుతోంది. అదే క్రమంలో రేవుపోలవరం బీచ్‌లో ఓ యువకుడు కొబ్బరి బొండాలు అమ్మే ప్రక్రియ స్మార్ట్‌గా చేస్తున్నాడు. బీచ్‌లో కొబ్బరి బొండాలు నరికేందుకు కత్తిని ఉపయోగించడం లేదు. అధునాతన యంత్రంతోనే కొబ్బరి బొండాలు కటింగ్ చేసి అమ్మకాలు సాగిస్తున్నాడు. పుచ్చకాయల కోసం అధునాతన పరికరం వాడుతున్నారు. పుచ్చకాయకు రంధ్రం పెట్టి అందులోనే జ్యూస్ తయారు చేసి విక్రయిస్తున్నారు. రేవుపోలవరం తీరంలో గుర్రంపై పర్యాటకులు ఫోటోలు దిగడానికి కౌబోయ్ గెటప్‌లో ఆకర్షిస్తున్నాడు. ఇలా స్మార్ట్ పద్ధతిలో చిరువ్యాపారులు వ్యాపారం చేస్తున్నారు.



అడ్డురోడ్డులో చెట్టుకు తూకం మిషన్ తగిలించి పుచ్చకాయ అమ్ముతున్న మహిళ

కౌబోయ్ వస్త్రధారణలో..



బీచ్‌లో పర్యాటకులకు ఫొటోలు తీసేందుకు పదేళ్లుగా ఉంటున్నాను. ఈ నేపథ్యంలో స్మార్ట్ ఫోన్లు రావడం వల్ల వ్యాపారం దెబ్బతింది. దాంతో కౌబోయ్ మాదిరిగా వస్త్రధారణతో ఆకర్షించి బీచ్‌లో ఫొటోలు తీస్తున్నాను.

– వాసుపల్లి అప్పన్న, రేవుపోలవరం

కొబ్బరి బొండాల మిషన్‌తో అమ్మకాలు



కొబ్బరి బొండాల నీళ్లు అమ్మేందుకు రూ.60 వేలతో అధునాతన యంత్రాన్ని కొనుగోలు చేశాను. దీనితో స్టాల్ ఏర్పాటు చేయడం వల్ల పర్యాటకులు ఆకర్షితులవుతున్నారు. కొబ్బరి బొండాను మిషన్‌తో కటింగ్ చేసి, గుజ్జుతో సహా ఇస్తున్నాను. అవసరమైతే కూలింగ్ చేసి కొబ్బరి నీళ్లు ఇస్తున్నాను.

– గనగళ్ల రాజేష్, కొబ్బరి బొండాల వ్యాపారి

విద్యార్థుల ఇళ్లకు గురువులు



కె.వెంకటాపురంలో విద్యార్థి తల్లికి కరపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు నాని



కొడవటిపూడిలో తల్లిదండ్రులకు కరపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: సర్కారు బడి గురువులు విద్యార్థుల కోసం ఇంటిబాట పట్టారు. ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్నారు. కె.వెంకటాపురంలో జెడ్పీ హైస్కూల్, కొడవటిపూడిలో ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో గురువారం విద్యార్థుల ఇళ్లను సందర్శించి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని వివరించారు. కె.వెంకటాపురంలో ఉపాధ్యాయులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు పైల నాని విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కొడవటిపూడిలో ఉపాధ్యాయులు ప్రతాప్‌కుమార్, లోవరాజు, శంకర్, స్కూల్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సదస్సును విజయవంతం చేయండి



దేశపాత్రునిపాలెంలో సిపిఐ జిల్లా సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

పరవాడ: నర్సీపట్నంలో శుక్రవారం జరగనున్న సీపీఐ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పార్టీ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. దేశపాత్రునిపాలెంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సదస్సుకు పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జేవీ సత్యనారాయణమూర్తి హాజరుకానున్నట్లు తెలిపారు. సదస్సులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఉద్యమ కార్యాచరణ గురించి చర్చించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని, సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బూసి పరమేశ్వరి, జి.లక్ష్మి, నారాయణమ్మ, ఆశ, తులసి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ స్థలం విక్రయిస్తే అడ్డుకుంటాం



ఏపీటీఎఫ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో ఏపీటీఎఫ్ సంఘానికి కేటాయించిన స్థలాన్ని విక్రయించాలని చూస్తే అడ్డుకుంటామని గ్రామ నాయకులు తెలిపారు. మేజర్ పంచాయతీ వడ్డాది దొరబాబు కాలనీలో అప్పటి ఏపీటీఎఫ్ సంఘ నాయకుడు ఉపాధ్యాయుడు వెలంపూడి సత్యనారాయణ కోరిక మేరకు 1999లో సర్వే నంబర్ 49లో 3 సెంట్ల స్థలాన్ని సంఘ భవనానికి కేటాయించారన్నారు. ఈ స్థలాన్ని గురువారం గ్రామనాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 25 ఏళ్లుగా సంఘ భవనం నిర్మాణం జరగకపోవడంతో స్థలం ఖాళీగా ఉందన్నారు. ఈ స్థలాన్ని ఇటీవల ఏపీటీఎఫ్ సంఘ నాయకులు కొంతమంది గ్రామ పంచాయతీకి, గ్రామ నాయకులకు తెలియకుండా విక్రయించాలని చూస్తున్నారని ఆరోపించారు. సంఘానికి భవనం కడతామంటే స్థలం కేటాయించాం తప్ప అమ్మకానికి కాదని, ఎవరైనా సంఘ భవనం స్థలం అమ్మినా, కొన్నా చెల్లుబాటు కాదని ఉప సర్పంచ్ దాడి సూరినాగేశ్వరరావు, నాయకులు దొండా నరేష్, అడపా నరసింహమూర్తి, సయ్యపురెడ్డి సత్యనారాయణ, మాధవరావు, కోవెల వెంకటర రమణ, తలారి శంకర్, కనక, సూరిబాబు తదితరులు స్పష్టం చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శంగా, సంఘ సేవకుల్లా ఉండాలి తప్ప రాజకీయాలు చేయడం తగదన్నారు. ఏపీటీఎఫ్ సంఘానికి కేటాయించిన స్థలంలో సంఘ భవనం కట్టాలి.. లేదంటే పంచాయతీకి తిరిగి స్థలం స్వాధీనం చేసుకుంటామన్నారు.

ఘనంగా తోబుట్టువుల దినోత్సవం



తోబుట్టువుల దినోత్సవంలో విద్యార్థులు

మాకవరపాలెం: స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులతో తోబుట్టువుల దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.రాము మాట్లాడుతూ అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లు ఆప్యాయతలతో కలసిమెలసి ఉండాలని సూచించారు. ఒకే పాఠశాలలో తోబుట్టువులు చదువుకోవడం ఎంతో అనుభూతిని ఇస్తుందన్నారు. సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక జాతర



నూకాంబిక ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

కోటవురట్ల: యండపల్లిలో నూకాంబిక జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రసాద వితరణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జాతరను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామమంతా విద్యుద్దీపాలంకరణతో కనువిందు చేసింది.

పెదఉప్పలంలో అన్న సమారాధన నేడు



నూతన వెండడి ఆభరణాల అలంకరణలో పట్టాభిరాముడు

ఎస్.రాయవరం: పెదఉప్పలం రామాలయంలో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీరామనవమి నుంచి ఇక్కడ అయిదు రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. సీతారాముల పట్టాభిషేకానికి విగ్రహాలకు వెండి ఆభరణాలు అలంకరించామన్నారు. స్వామివారికి సమర్పించిన కానుకలతో మూడు కేజీల వెండితో వస్తువులు చేయించి అలంకరించినట్టు చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వేపగుంటలో విద్యార్థులతో కలిసి వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు

పెందుర్తి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ విభాగం ఎస్ఐ నరసింగరాజు అన్నారు. పెందుర్తి, సుజాతనగర్, వేపగుంట కూడళ్ల వద్ద గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. హెల్మెట్, కారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అని కోరారు. పూర్తిస్థాయిలో అవగాహన లేని తల్లిదండ్రులకు పిల్లలు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగించాలని సూచించారు. పలు విద్యాసంస్థల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

వర్షంతో ఉపశమనం



యలమంచిలి పట్టణంలో గాంధీనగరంలో కురుస్తున్న వర్షం



రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతంలో కురుస్తున్న వర్షం



ఒంపోలులో కురుస్తున్న వర్షం

యలమంచిలి రూరల్: ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరవుతున్న యలమంచిలి ప్రజలకు గురువారం సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనాన్ని కలిగించింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడి ప్రతాపంతో ప్రజానీకం అల్లాడారు. సాయంత్రం 4 గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమై చల్లటి గాలులు వీచాయి. కొద్దిసేపటికే అరగంట సేపు మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం రబీ సీజన్ కీలక దశలో ఉన్న వరి, మొక్కజొన్న సహా వివిధ పంటలకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోత దశలో ఉన్న జీడి, మామిడి గాలులకు రాలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వేసవి దుక్కులు చేసుకునేందుకు వర్షం ఉపకరిస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. 15 రోజులుగా ఎండ ప్రభావం ఎక్కువగా ఉండడం, గురువారం సాయంత్రం మబ్బులు కమ్మి వర్షం కురవడంతో వేసవి తాపం నుంచి యలమంచిలి పట్టణం, పరిసర ప్రాంత ప్రజానీకం ఉపశమనం పొందారు. కొద్దిసేపు కురిసిన వర్షానికే పట్టణంలో కొన్ని ప్రధాన రహదారులపై వర్షపు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు కలిగించింది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతోనే వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఉంటోంది. ఉరుములు, మెరుపులతో కూడిన వానతో సాంత్వన చేకూరింది. రాబోయే నాలుగు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చేసిన ప్రకటన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మునగపాక: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ప్రజలకు ఉపశమనం కలిగింది. కొద్ది రోజులుగా ఎండల తీవ్రతతో సతమతమయ్యే ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. ఈ వర్షం పొలాలకు మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు. వరితోపాటు చెరకు సాగుకు ఈ వర్షం మేలు చేస్తుందని వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి తెలిపారు.

ఘనంగా దుర్గమాంబ పండగలు



బొడ్డపువానిపాలెం దుర్గమాంబ సన్నిధిలో భక్తులు



మామిడివానిపాలెం దుర్గమాంబ

పరవాడ: మండలంలోని ఈ బోనంగి శివారు బొడ్డపువానిపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబ పండగ మహోత్సవాలను గ్రామ ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు బొడ్డపు చిన్నారావు, సర్పంచ్ బొడ్డపు శ్రీనివాసరావులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక లివింగ్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ, మంచినీరు అందించారు. ఉప సర్పంచ్ మేడిశెట్టి వెంకటరమణ దంపతులు, సంస్థ అధ్యక్షుడు బొండా తారక రమేష్‌కుమార్ కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్, బుగిడి రామగోవిందరావు, వియ్యపు చిన్న, వర్రి వరదేశినాయుడు, బాలాజీనాయుడు, పైల దినేష్, నగిరెడ్డి చిన్నారావు, వెన్నల నరసింగరావు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

- కన్నూరు శివారు మామిడివానిపాలెం గ్రామంలో దుర్గమాంబ పండగను శీరంశెట్టివానిపాలెం, మామిడివానిపాలెం గ్రామాల ప్రజలు గురువారం ఘనంగా జరిపారు. వేకువ జాము నుంచి అమ్మవారికి ధూపదీప నైవేద్యాలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం పలు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, ఉచిత ప్రసాదాలను అందించాయి. నేల డ్యాన్సులు, కోలాటాలు, తప్పెటగుళ్లు, మేళతాళాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి, రాత్రికి బాణ సంచా వెలుగుల నడుమ అనుపు మహోత్సవాన్ని వేభవంగా నిర్వహించారు.

విశాఖలో విద్యుత్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సు రేపు



పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దేవరాపల్లి : విద్యుత్ రంగ ప్రైవేటీకరణ ఆపాలని, పర్మనెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 12న విశాఖపట్నంలో జరిగే ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రీజనల్ కార్యదర్శి ప్రేమ చంద్రశేఖర్ కోరారు. విశాఖపట్నం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. దేవరాపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పోస్టర్, కరపత్రాన్ని గురువారం యూనియన్ నాయుకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.రాము, ఎస్. అవతారం, టి.శేష, సిఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలి డబ్బులు వెంటనే చెల్లించాలి



విలేకరులతో మాట్లాడుతున్న వెంకన్న, గిరిజన సంఘం నాయకుడు నరసింహమూర్తి

మాడుగుల: కేంద్ర, ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించక వారి పొట్ట కొడుతోందని, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి విమర్శించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఉపాధి కూలీలకు కూలి డబ్బులు చెల్లించాలన్నారు.

రోగులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

కె.కోటపాడు : స్థానిక సీహెచ్‌సీలో రోగులకు అందించే భోజన సౌకర్యాన్ని మరింతగా మెరుగుపర్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. కె.కోటపాడు సీహెచ్‌సీని గురువారం ఆయన పరిశీలించారు. రోగులకు భోజనానికి ప్రతి రోజూ రూ.100లను ప్రభుత్వం వీరికి చెల్లిస్తున్నా, దానికి సరిపడా నాణ్యమైన భోజనం అందివ్వడం లేదని ఆరోపించారు. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలన్నారు.

భవిత కేంద్రానికి సామగ్రి వితరణ

పరవాడ: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు పీవై నాయుడు అండ్ కో కంపెనీ సొంత నిధులు రూ.25 వేలతో సమకూర్చిన వస్తువులను పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు గురువారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి సాయిశైలజ, స్థానిక నాయకులు పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, టి.వెంకటరావు, సీహెచ్ కనకారావు, పైల హరీష్, రాంకీ హెచ్‌ఆర్ గిరిధర్ బక్షి పాల్గొన్నారు.